

## డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేయాలి

**రంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

ఆదిబట్ల, మార్చి 29: మండల పరిధిలోని లింగంపల్లి గేటు సమీపంలోని డబుల్ బెడ్ రూం ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతూ శనివారం సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోముల గ్రామంలోని సర్వే నంబర్ 100లో ప్రభుత్వం నిర్మించిన 96 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గ్రామానికి చెందిన 31మంది, లింగంపల్లికి చెందిన మరో 30 మంది, మంచాలకు చెందిన 30 మంది, చెన్నారెడ్డిగూడకు చెందిన ఐదుగురికి ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల ద్వారా తహసీల్దార్ సమక్షంలో డ్రా పద్ధతిన ఎంపిక చేశారని అన్నారు. ఇప్పటి వరకు వారికి ఇండ్లను అప్పగించలేదని, వెంటనే వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుమలత, లబ్ధిదారుల కమిటీ సభ్యులు బాలరాజ్, అమృత, రేహనా పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, మార్చి 29: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన, బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అటకెక్కాయని విమర్శించారు. రుణమాఫీ, రైతు భరోసా పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బూత్ స్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు.

**ఏప్రిల్ 2న మాజీ మంత్రి హరీశ్‌రావు రాక**

కడ్తాల్ మండలానికి ఏప్రిల్ 2న మాజీ మంత్రి హరీశ్‌రావు విచ్చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని చరికొండ గ్రామ పంచాయతీలోని బోయిన్‌గుట్ట తండాలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ముద్విన్‌లో పేద కుటుంబానికి, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇంటిని ప్రారంభిస్తారని జైపాల్ యాదవ్ వివరించారు. హరీశ్‌రావు పర్యటనను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, వెంకటయ్యాయాదవ్, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, హరిచంద్‌నాయక్, దేవానాయక్, లోకేశ్‌నాయక్, నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, గోపాల్, రమేశ్‌నాయక్, నాయకులు మహేశ్, రామచంద్రయ్య, మహేశ్, కృష్ణ, జంగయ్య, గోపాల్, కుమార్‌గౌడ్, యాదయ్య, ముత్యాలు, నర్సింహ, సురేశ్, నాగార్జున్, అంజి, వినోద్, సాబేర్, రవి, రాజు, రమేశ్, రాజేశ్ పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులు

## స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించాలి

మంచాల, మార్చి 29: పంచాయతీ, మున్సిపాలిటీ, మండల జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేలా అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 1నుంచి 30వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన లక్ష సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా శనివారం మంచాల మండల కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులకు నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టం చేసి అమలు చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు అంజయ్య, బాల్‌రాజ్, పాండు రంగారెడ్డి, ధానయ్య, మల్లేష్, మహిపాల్ రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి సమస్యలను వివరిస్తున్న అనాజ్‌పూర్ యాదవ సంఘం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 29 : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని అనాజ్‌పూర్ గ్రామ యాదవ సంఘం నాయకులు శనివారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తమ సమ్యలను వివరించారు. గ్రామంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, నిర్మాణంలో ఉన్న యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌కు నిధులు ఇవ్వాలని కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విద్యుత్ ఏఈ నరేష్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని చెప్పారని తెలిపారు. అదే విధంగా కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ. 5లక్షల నిధులు మంజూరు చేయాలని డీఈ అబ్బాస్‌కు చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



కేశంపేటలో మానవ అక్రమ రవాణాపై ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సిబ్బంది, మహిళలు

చేవెళ్లటౌన్, మార్చి 29: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని చేవెళ్ల మండల ఏపీఎం శోభారాణి తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీవో, వీవోఏలకు మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అపరిచితులు, అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 1930, 100కు డయల్ చేసి సమాచారం అందివ్వాలని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు సాగర్, శ్రీనివాస్, నర్సింహులు, షబీర్, మాణెయ్య, ప్రభాకర్, మండల వీఓఏలు, వీవోఎస్ ఉన్నారు.

**అవగాహన సదస్సు**

కేశంపేట : మండల మహిళా సమాఖ్యలో మానవ అక్రమ రవాణా, సైబర్ ఆధారిత అక్రమ రవాణాపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించి సమాఖ్య భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ మీర్ ఆజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య హాజరై మాట్లాడారు. కొందరు దత్తత పేరుతో పిల్లలను తీసుకొని అక్రమంగా కూలీ, సర్కస్, భిక్షాటన, ఇంటిపని, తదితర పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కోశాధికారి గీత, ఏపీఎం భగవంతు, సీసీలు రామచంద్రయ్య, మల్లేశ్, తిరుపతమ్మ, నర్సింహ, సమాఖ్య సిబ్బంది కవిత, మహేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన శంకర్‌పల్లి తైబజార్ వేలం



వేలం పాట వేస్తున్న తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, మార్చి 29 : 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం తైబజార్ వేలం పాటను అధికారులు నిర్వహించారు. ఈ వేలంలో శంకర్‌పల్లికి చెందిన మాచర్ల మమత రూ.15లక్షల 75 వేలకు తైబజార్‌ను దక్కించుకున్నది. మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ పేమెంట్ కట్టిన వెంటనే ధ్రువీకరణ పత్రం అందజేస్తామని కమిషనర్ యోగేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.



శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం నిర్వహిస్తున్న అధికారులు

**తుర్కయాంజాల్‌లో..**

తుర్కయాంజాల్ : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ సంఘం చికెన్, మాంస వ్యర్థాల సేకరణకు శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. షబ్బీర్ అనే వ్యక్తి రూ.5,81000లకు మాంసం వ్యర్థాల సేకరణను ఈ వేలంలో దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చికెన్, మాంసం వ్యర్థాల సేకరణను శాస్త్రీయ పద్ధతిలో జరుగడం కోసమే వేలం నిర్వహించినట్లు తెలిపారు.

## సెలవుల్లోనూ సేవలు

పెద్దఅంబర్‌పేట, మార్చి 29 : సెలవు రోజుల్లోనూ పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ పనిచేస్తుందని కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉగాది, ఈ నెల 31న సోమవారం రంజాన్ పండుగ రోజుల్లో సెలవులు ఉన్నప్పటికీ.. మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు కౌంటర్‌ను సద్వినియోగం చేసుకుని ఆస్తి పన్ను చెల్లించాలని కోరారు. ఆస్తి పన్నుతోపాటు ట్రేడ్ లైసెన్సు ఫీజులు, ఎల్ఆర్ఎస్ సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలన్నారు.

## ఆస్తి పన్ను చెల్లించవచ్చు

మొయినాబాద్, మార్చి29: రెండు రోజుల పాటు వరుసగా ప్రభుత్వ సెలవు దినాలు ఉన్నప్పటికీ ఆస్తి పన్నులు చెల్లించడానికి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగల నేపథ్యంలో సెలవు దినాలు ఉండటం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఆస్తి పన్ను, నల్లా బిల్లు చెల్లించాలని సూచించారు. నల్లా బిల్లు కానీ, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించకుంటే అదనంగా చెల్లించాల్సి వస్తుందన్నారు.

## కండ్ల అద్దాలు పంపిణీ

చేవెళ్ల రూరల్, మార్చి 29 : మండల పరిధి ఊరెళ్ల గ్రామంలో ఇటీవల యువ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం గ్రామస్తులకు వైభవ్‌రెడ్డి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐ సంతోశ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, బీజేపీ మండలాధ్యక్షుడు అనంత్ రెడ్డి, ఊరెళ్ల మాజీ సర్పంచ్ జహంగీర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఏసీపీ కిషన్, సీఐ భూపాల్ శ్రీధర్

చేవెళ్ల రూరల్, మార్చి 29 : చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద గ్రామంలో 6వ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఏసీపీ కిషన్, సీఐ భూపాల్ శ్రీధర్ ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ ఏసీపీ కిషన్, సీఐ భూపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేశం గుప్తా, శైలజాఆగిరెడ్డి, జహంగీర్, గోపాల్‌రెడ్డి, స్థానిక నేతలు కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, శీను, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించాలి



మున్సిపల్ సిబ్బందికి పన్ను చెల్లిస్తున్న రైతుబంధు సమితి మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి

తుర్కయాంజాల్, మార్చి 29: ప్రజలంతా సకాలంలో పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి అన్నారు. మున్సిపాలిటి పరిధి తొర్రూర్‌లోని షెడ్ల పన్నును శనివారం ఆయన మున్సిపల్ సిబ్బందికి చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులను అందించిందని గుర్తు చేశారు. పన్నులను చెల్లించి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ

మంచాల, మార్చి 29: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని మంచాల సీఐ మధు అన్నారు. శనివారం మంచాల మండలం జాపాల గ్రామంలో సైబర్ నేరాలపై యువతకు ఆయన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఎవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితిలో చెప్పవద్దని అన్నారు. నిరంతరం పోలీసులు ప్రజల కోసమే పనిచేస్తున్నారని గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే 100కు డయల్ చేయాలని సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై సతీశ్ పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేట : పట్టాలు అందుకున్న విద్యార్థినులతో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ మహమూద్ తదితరులు



మొయినాబాద్ : నక్కలపల్లిలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

# సేవాభావాన్ని అలవర్చుకోవాలి

పెద్దఅంబర్‌పేట, మార్చి 29 : విద్యార్థులు చదువుతోపాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఎస్‌కే మహమూద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలో బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-4 విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహమూద్ హాజరై మాట్లాడుతూ.. మహిళా విద్యాభివృద్ధి లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సేవా దృక్పథాన్ని పెంచడమే ఎన్ఎస్ఎస్ ఉద్దేశమన్నారు. విద్యార్థులు కాలేజీని వదిలి పల్లెబాట పట్టినప్పుడే క్షేత్రస్థాయిలో ప్రజల తీరుతెన్నులు తెలుస్తాయని, సేవ చేయడం అలవాటుగా మారుతుందని ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ అసోసియేట్ రవితేజ అన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, నాయకులు దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఎన్ఎస్ఎస్ పట్టాలు అందజేశారు.

**విద్యార్థుల సేవలు అభినందనీయం**

మొయినాబాద్, మార్చి29: విద్యార్థులు గ్రామాల్లో సేవలు చేయడం అభినందనీయమని గ్రామ నాయకుడు నీలకంఠం అన్నారు. హైదరాబాద్‌లోని దోమలగూడలోని ఏవీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-2 వారు ఆరు రోజుల నుంచి మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా డ్రగ్స్ నివారణపై గ్రామంలో క్యాండీల్ చేతబూని ర్యాలీ నిర్వహించి.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రోగ్రామ్ అధికారి అంజయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ యువనాయకులు నీరంజన్‌గౌడ్, భగవత్‌రెడ్డి, అర్జున్, మధు, కరుణాకర్ ఉన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

మొయినాబాద్, మార్చి29: ఆర్థిక సమస్యలతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన మేకల కొమురయ్యకు ఏకైక సంతానం మధు(21)పండ్ల వ్యాపారం చేసేవాడు. కొంత నష్టం రావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో గత పది రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స కోసం నగరంలోని దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి అంత్యక్రియలో గ్రామస్తులు, స్నేహితులు పెద్ద సంఖ్యంలో పాల్గొని వీడ్కోలు పలికారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీఐ భూపాల్ శ్రీధర్‌కు సీసీ కెమెరాల ఏర్పాటుకు చెక్కును అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్

చేవెళ్ల రూరల్, మార్చి 29 : మండల పరిధి ఊరెళ్ల గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం ఊరెళ్ల గ్రామంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌కు రూ. లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వైభవ్ రెడ్డి, అనంత్‌రెడ్డి, జహంగీర్, గ్రామస్తులు ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు షురూ


మొయినాబాద్, మార్చి 29 : విద్యా సంవత్సరం పూర్తి కాక ముందే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం యథేచ్ఛగా అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ నిఘా కరువైందని, ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యా సంవత్సరం పూర్తి కాక ముందే నిబంధనలకు విరుద్ధంగా అడ్మిసన్లు తీసుకుంటున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రేశ్వంత్, సాయికిరణ్, దిలీప్, అనీల్, రామ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్లటౌన్, మార్చి 29: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివశంకర్ మాదిగ అన్నారు. ప్రతి నెల గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ రాజ్యాంగం సమానహక్కులు కల్పించిందన్నారు. ఒకరు ఇంకొరిపై వివక్ష చూపితే చట్టరీత్యా నేరం అవుతుందని సూచించారు. సమాజంలో సమానత్వాన్ని పాటించేలా వివక్షత లేకుండా జీవించడానికి పౌర హక్కు చట్టం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

చేవెళ్ల రూరల్, మార్చి 29 : శంకర్‌పల్లి మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## దేవాలయంలో చోరీ

తుర్కయాంజాల్, మార్చి 29 : మున్సిపాలిటీ పరిధి పాటిగూడ పోచమ్మ దేవాలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాగన్నగూడ పాటిగూడలోని పోచమ్మ దేవాలయంలోని హుండీని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి నగదును దోచుకొని వెళ్లారు. స్థానికులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

## తిరుపతికి వెళ్తుండగా కారు బోల్తా

**బండరావిరాల వాసి మృతి.. మరో ముగ్గురికి గాయాలు**

పెద్దఅంబర్‌పేట, మార్చి 29: తిరుపతికి వెళ్తుండగా.. శ్రీకాళహస్తి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్దుల్లాపూర్‌మెట్టు మండల పరిధిలోని బండరావిరాలకు చెందిన ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బండరావిరాల మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి (51), తన స్నేహితులు సామల బాల్‌రెడ్డి, చింతల మల్లారెడ్డి, తారామతిపేట గ్రామానికి చెందిన భరత్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం కారులో తిరుపతికి బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున శ్రీకాళహస్తికి సమీపంలోని తిరుపతి-నాయుడుపేట హైవేపై వెళ్తుండగా.. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టినట్టు తెలుస్తున్నది. కారు నుజ్జునుజ్జయి డ్రైవర్ సీటులో ఉన్న శ్రీనివాస్‌రెడ్డి ముందుభాగంలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డట్టు తెలుస్తున్నది. క్షతగాత్రులను స్థానికులు దగ్గరలోని దవాఖానకు తరలించారు. ప్రమాదానికి నిద్రమత్తే కారణమని పోలీసులు భావిస్తున్నారు.

## సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు జగదీశ్వర్‌గౌడ్

కేశంపేట, మార్చి 29: మండల పరిధిలోని కొత్తపేట పీఏసీఎస్ సీఈవో అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాజన సభను చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. 2025-26 సంవత్సరానికిగాను రూ.10,17,184 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో అనిత, శంకర్, చంద్రశేఖర్, యాదయ్య, కిష్టానాయక్, కృష్ణయ్య, బాలకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

## బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు



నందిగామ, మార్చి 29: ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నందిగామ సీఐ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్‌లో బెట్టింగ్ పెట్టి డబ్బులు పోగొట్టుకుని ఎంతో మంది అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న ఘటనలు జరుగుతున్నాయని, ముఖ్యంగా యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. యువత తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై దృష్టి సారించాలని, బెట్టింగ్‌లను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.